## క్లుప్తంగా

### హుండీ కానుకల లెక్కింపు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ

కర్నూలు కల్చరల్: జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం హుండీ కానుకలను ఈఓ ప్రసన్నలక్ష్మి, ఫెస్టివల్ ఆఫీసర్ గుర్రెడ్డి పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.1,66,690 నగదు సమకూరింది. జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి కోశాధికారి వాసుదేవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి నుంచి జ్ఞానయజ్ఞం

కర్నూలు కల్చరల్: చిన్మయ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు ఓల్డ్‌సిటీ వన్‌టౌన్ సమీపంలోని గీతా మందిరంలో సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు జ్ఞానయజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గీతా మందిరం అధ్యక్షులు రేగూరు విజయభాస్కర్ తెలిపారు. చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతిచే శంకర భగవత్పాదుల విరచిత సౌందర్యలహరిపై ప్రవచనం ఉంటుందన్నారు.

### నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా రంగనాయకి సమేత రంగనాథస్వామి ఆలయంలో ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గోదా గోకుల వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త సోమవారం తెలిపారు.

### ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణమే వెల్లడించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి ఎస్‌బీఐను డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌బీఐ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ ఎస్‌బీఐ నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు బీజేపీకి చెంప పెట్టువంటిదన్నారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ ఆనందబాబు, మార్కెల్ల విజయ్, వై.నగేష్, గురుశేఖర్, పుల్లారెడ్డి, సాయిబాబా, షరీఫ్, రామకృష్ణ పాల్గొన్నారు.

### శానిటరీ వర్కర్లకు పనిభారం తగ్గించాలి

కర్నూలు(సెంట్రల్): పాఠశాలలు, కళాశాలలలో పని చేస్తున్న శానిటరీ వర్కర్లకు పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటరీ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న జనవరి, ఫిబ్రవరి మాసాల వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే నైట్ వాచ్‌మెన్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

### విశిష్ట మహిళలకు సన్మానం



సన్మానం పొందిన విశిష్ట మహిళలు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీపతంజలి సాయినాథ్ యోగా సేవా ట్రస్ట్ మహిళా విభాగం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం వెంకటరమణ కాలనీలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఐదుగురు మహిళను సన్మానించారు. దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ చేశారు. డౌన్ సిండ్రం వ్యాధితో బాధపడుతున్న నలుగురు విద్యార్థులను సన్మానించారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేశారు. యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య, మహిళా విభాగం ప్రతినిధులు సుచరిత, భ్రమరాంభ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీతో పొత్తుపై బాబు సమాధానం చెప్పాలి



మాట్లాడుతున్న డాక్టర్ షేక్ మహబూబ్‌బాషా

కర్నూలు(అర్బన్): ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవడంపై టీడీపీ అధినేత చంద్రబాబు ముస్లింలకు సమాధానం చెప్పాలని ముస్లిం మైనారిటీ రైట్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ షేక్ మహబూబ్‌బాషా కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మైనారిటీలకు అమలవుతున్న నాలుగు శాతం రిజర్వేషన్, వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ, దుల్హన్ పథకం అమలుపై చంద్రబాబు స్పష్టత ఇవ్వాలన్నారు. బీజేపీతో తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకోవడంపై ముస్లింలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా తాము ముస్లిం మైనారిటీల హక్కుల సాధనకు ఉద్యమిస్తున్నామన్నారు. ఇప్పటికే ముస్లిం మైనారిటీల హక్కుల సాధనకు కర్నూలు, ఆదోని, నంద్యాల ప్రాంతాల్లో గర్జన కార్యక్రమాలను నిర్వహించామన్నారు.

# భానుడు భగభగ..

- జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- పలు చోట్ల 38 – 40 డిగ్రీల సెల్సియస్ దాకా ఉష్ణోగ్రతలు
- చల్లదనం కోసం కూల్‌డ్రింక్‌ల వైపు పరుగు
- రసాయనాల కంటే సంప్రదాయక ద్రవాలే మేలు
- వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తప్పనిసరి
- మసాలా ఫుడ్, బయటి ఆహారానికి దూరంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. ఫలితంగా జనం అల్లాడిపోతున్నారు. ఓ వైపు ఎండ తీవ్రత మరోవైపు ఉక్కపోతతో జనం అటు బయట, ఇటు ఇంటా ఉండలేక ఇబ్బంది పడుతున్నారు. దాహాన్ని తీర్చుకోవడానికి అందుబాటులో ఉన్న నీటిని, కూల్‌డ్రింక్‌లను తాగుతున్నారు. ఈ క్రమంలో పలువురు అనారోగ్యానికి గురవుతున్నారు. దీనికితోడు బయటి ఆహారం సైతం జీర్ణకోశవ్యాధులను కలిగిస్తూ ఇబ్బంది పెడుతోంది. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

జిల్లాలో పలు చోట్ల పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్ నుంచి 40 డిగ్రీలకు చేరుకున్నాయి. ఇది సాధారణం కంటే రెండు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు అదనంగా ఉంటున్నాయి. జనం దాహం తీర్చుకునేందుకు కూల్‌డ్రింక్స్‌వైపు మొగ్గు చూపుతుండటంతో రెండు వారాల నుంచి ఈ తరహా వ్యాపారం ఊపందుకుంది. గత నెల నిమ్మకాయలు మార్కెట్‌లో ఒకటి రూ.2ల నుంచి రూ.3లకు లభించేది. ప్రస్తుతం రూ.5లు దాటింది. సోడాలు, లెమన్లు, నన్నారి, లస్సీలు, ఫ్రూట్‌జ్యూస్(పండ్ల రసాలు), కృత్రిమ రంగులతో తయారైన కూల్‌డ్రింక్స్ అధికంగా విక్రయిస్తున్నారు. వీటిలో వాడే ఐస్ అపరిశుభ్రమైన నీటితో తయారు కావడం వల్ల అది జీర్ణకోశవ్యాధులకు గురిచేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏ పూటకు ఆ పూట ఆహారాన్ని వండుకుని తినాలని వారు సూచిస్తున్నారు. మరోవైపు ప్రజలు వడదెబ్బకు గురిగాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టారు. అవసరమైన చోట ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. కర్నూలు నగరంలోని ప్రధాన కూడళ్లలో బస్సులు ఆగే చోట చలువ పందిళ్లు వేసి నీడ ఏర్పాటు చేశారు.

#### ఎండకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలి

ఉపాధి హామీ కూలీలు, 50 ఏళ్లు వయస్సుపైబడిన వారు తమ ప్రయాణంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్ వెంట తీసుకెళ్లాలి. వేడిమి ఎక్కువగా ఉన్నచోట ఎక్కువ శ్రమతో కూడిన పనిచేయడం(హోటల్స్ వంట గదుల్లో పనిచేసేవారు, కార్మికులు, రైతులు, నిర్మాణ పనులు, ఇటుక బట్టీలలో పనిచేసేవారు, పోలీసులు, రోడ్డుపక్కన వ్యాపారం చేసే చిరువ్యాపారులు, ఎండలో ప్రయాణం చేసేవారు), గర్భిణులు, పాలిచ్చే తల్లులు, అప్పుడే పుట్టిన పిల్లలు, పసిపిల్లలు, రేకుల షెడ్డులో నివసించేవారు అధిక జాగ్రత్తలు తీసుకోవాలి. బీపీ, షుగర్, గుండె జబ్బులున్న వారు జాగ్రత్తగా ఉండాలి. వీరి శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం, శరీరం ఎక్కువ ఉష్ణాన్ని కోల్పోవడం వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది.



#### వడదెబ్బ లక్షణాలు

తలనొప్పి, తలతిరగడం, నాలుక ఎండిపోవడం/పిడచ కట్టుకు పోవడం/చెమట పట్టకుండుట, ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం కలిగి ఉండటం, మగత కలవరింతలు, ఫిట్స్, పాక్షిక, పూర్తి అపస్మారక స్థితి.

#### వడదెబ్బ తగలకుండా..

- సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగకూడదు.
- తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ, ఉప్పు కలిపిన పళ్ల రసాలు తాగి బయలుదేరాలి.
- వేసవి కాలంలో తెల్లని దుస్తులు ధరించాలి. ముదురు రంగు దుస్తులు, నల్లని వస్త్రాలు ధరించకూడదు.
- ఆల్కాహాలు తాగడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. అది విషమ పరిస్థితికి దోహదం చేస్తాయి. కనుక మద్యపానానికి దూరంగా ఉండాలి.
- ఇంటి గదులు ఉష్ణోగతను తగ్గించేందుకు కిటికీలకు, తలుపులకు తెరలను వాడి వేడిని తగ్గించాలి. ఫ్యాన్లు, ఎయిర్‌కండిషనర్లు వాడాలి.
- వేడిగా ఉన్నప్పుడు, ఎండలో గొడుగు లేకుండా తిరగకూడదు
- తప్పనిసరి పరిస్థితుల్లో మండుటెండలో బయటకు వెళ్లాలంటే మంచినీటి బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి.
- వేసవి కాలంలో బయటకు వెళ్లే అవసరం ఉంటే ఉదయం/సాయంత్రం సమయాల్లో వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలి.
- తలకు తెల్లని టోపీ/రుమాలు లేకుండా ఎండలో తిరగరాదు.

#### జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవి తీవ్రత అధికంగా ఉన్న ప్రస్తుత సమయంలో వడదెబ్బకు గురిగాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి మార్చాలి. గాలి తగిలేలా చూడాలి. దుస్తులు వదులుచేసి చల్లని నీటిలో ముంచిన బట్టతో తరచుగా శరీరం తుడవాలి. ఓఆర్‌ఎస్ ద్రావణం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నీటిని/మజ్జిగను తాగించాలి. వీలైనంత త్వరగా వడదెబ్బకు గురైన వ్యక్తిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యం చేయించాలి. ఒక్కోసారి వడదెబ్బకు గురికావడం వల్ల శరీరంలోని నీరు, లవణాలు కోల్పోయి ప్రాణాంతకం అవుతుంది.

– డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

### 'స్పందన' సమస్యలకు పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): స్పందనలో వచ్చే సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందనకు వచ్చిన దరఖాస్తులను అడిషనల్ కమిషనర్ స్వీకరించారు. మున్సిపల్ ఎస్‌ఈ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

### పోలీస్ స్పందనకు 74 ఫిర్యాదులు

కర్నూలు: స్థానిక రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కన సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 74 ఫిర్యాదులు వచ్చాయి. కర్నూలు డీఎస్పీ విజయ శేఖర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారితో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూతగాదాలు, కుటుంబ కలహాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు.

## ఇంతియాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి

- ముస్లిం మత పెద్దలతో సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఇంతియాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి కోరారు. సోమవారం గణేష్‌నగర్‌లోని మజీద్‌-ఏ- సమ్మద్‌లో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాధికుడు, పరిపాలనలో విశేష అనుభవం ఉన్న మంచి వ్యక్తి ఇంతియాజ్ కర్నూలు నియోజకవర్గ సమన్వయ కర్తగా రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. మనందరం కలిసికట్టుగా ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. ఇంతియాజ్ మాట్లాడుతూ తనకు అవకాశం ఇస్తే నగర అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ముస్లిం మత పెద్దలు మాజీ ఎమ్మెల్యేను, ఇంతియాజ్‌ను ఘనంగా సత్కరించారు.



ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి. చిత్రంలో ఇంతియాజ్

#### ఇంతియాజ్‌కు పాస్టర్స్ అసోసియేషన్ మద్దతు

స్థానిక రాక్‌వుడ్ చర్చిలో సోమవారం పాస్టర్లతో ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

### ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతా

- కర్నూలు నియోజకవర్గ సమన్వయ కర్త ఇంతియాజ్

నిన్నటి వరకు ఒకరినొకరు తిట్టుకుని, ఎన్నికల కోసం అవకాశ వాద పొత్తులతో వస్తే ప్రజలు నమ్మరని వైఎస్సార్‌సీపీ నియోజవర్గ సమన్వయ కర్త ఇంతియాజ్ అన్నారు. సోమవారం నరసింగరావుపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధికి ప్రజలు దాసోహమయ్యారన్నారు. చంద్రబాబు నాయుడు చేసింది చెప్పుకునేందుకు ఏమీ లేకనే జనసేన, జేబీపీపై ఆధారపడి ఎన్నికలకు వస్తున్నారన్నారు. ఇక్కడే పుట్టి పెరిగిన తాను.. జగనన్న పాలన నచ్చి పార్టీలో చేరానన్నారు. 30 ఏళ్లు వివిధ హోదాల్లో ప్రజలకు సేవలందించానన్నారు. తనకు అవకాశం ఇస్తే కర్నూలును ఆదర్శంగా దిద్దుతానన్నారు.

## పార్టీ విజయానికి పని చేద్దాం

- వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త బీవై రామయ్య

కర్నూలు (టౌన్): పార్టీ విజయానికి కలిసికట్టుగా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త బీవై రామయ్య అన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన బీవై రామయ్య సోమవారం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా బీవై రామయ్య, కర్నూలు నియోజకవర్గ అభ్యర్థి ఇంతియాజ్ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.



బీవై రామయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

## సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించండి

కర్నూలు(సెంట్రల్): సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల ను గుర్తించాలని పాణ్యం నియోజకవర్గ ఆర్‌ఓ/జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం అసెంబ్లీ పరిధిలోని ఏఈఆర్‌ఓలు, సెక్టోరియల్, పోలీసు సెక్టోరియల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో జరిగిన గొడవలు, ప్రలోభాలు, మత, రాజకీయపరమైన ఘటనలు, ఫిర్యాదులు, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం తదితరఅ అంశాలను పరిశీలించి ఇంకా ఏవైనా సమస్మాతక పోలింగ్ స్టేషన్‌లు ఉంటే గుర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ భావన, ఓర్వకల్లు, కల్లూరు, పాణ్యం తహసీల్దార్లు నగరాజు, మునివేలు, ఫణికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

## కొన్ని కూరగాయలను మితంగా తినాలి

కర్నూలు(హాస్పిటల్): గాయిట్రోజన్స్ రసాయనాలుండే ముల్లంగి, క్యాబేజీ, కాలిఫ్లవర్, చిలగడదుంపలు థైరాయిడ్ గ్రంథి అయోడిన్‌ను గ్రహించకుండా ఆటంకపరుస్తాయని, వీటిని మితంగా తినాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శైలేష్‌కుమార్ సూచించారు. జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అయోడిన్ లోప రుగ్మతల స్థాయి నిర్ధారణ కోసం గార్గేయపురం ప్రాథమిక పాఠశాలలో 6 నుంచి 12 ఏళ్ల పిల్లల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలేష్‌కుమార్ మాట్లాడుతూ అయోడిన్ సూక్ష్మ పోషకమని, గర్భిణులలో లోపిస్తే గర్భస్రావం, మృతశిశు జననం, అనువంశిక లోపాలు, తక్కువ బరువు, మరుగుజ్జుతనం, మూగతనం, చెవిటితనం, బుద్ధిమాంద్యం పిల్లలు జన్మిస్తారన్నారు. పెద్దవారిలో శారీరక ఎదుగుదల లోపంతో పాటు గాయిటర్(గొంతువాపు) వ్యాధికి గురవుతారన్నారు. గార్గేయపురం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ 90 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఉప్పు, మూత్రనమూనాలను సేకరించి రాష్ట్రస్థాయి ప్రయోగశాలలో పరీక్షల కోసం పంపామన్నారు. డిస్ట్రిక్ట్ ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం భారతమ్మ, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.



బాలున్ని పరీక్షిస్తున్న డాక్టర్ శైలేష్‌కుమార్

# మహిళా సంక్షేమమే జగనన్న ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

కర్నూలు సిటీ: మహిళా సంక్షేమమే జగనన్న ధ్యేయమని వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పసుపుల సమీపంలోని యూబీఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్‌ఆర్ చేయూత నాల్గవ విడత సంబరాలు సూర్యోదయం మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయడు లాగా మాయ మాటలు చెప్పి మోసం చేసే ఉద్దేశం జగనన్నకు లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున అందిస్తూ అక్కాచెల్లెమ్మలను ఆదుకున్నారన్నారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతో మనోసారి జనసేన, బీజేపీతో జతకట్టి ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు వస్తున్నారని ఎవరూ నమ్మొద్దని సూచించారు. ఓటుతో మరోసారి బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, చేయూత చెక్కును మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహిమియా, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు అందిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

### మహేశ్వరరెడ్డిని కలిసిన సతీష్

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ సోమవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ విజయానికి కలిసికట్టుగా పనిచేద్దామని కోరారు. ఈ సందర్భంగా సతీష్‌ను మహేశ్వరరెడ్డి సత్కరించారు.



సతీష్‌ను సత్కరిస్తున్న మహేశ్వరరెడ్డి

## రైతుల అభ్యున్నతే పాలక వర్గం లక్ష్యం

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పని చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్ కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మార్కెట్ యార్డులో రూ.6 కోట్లతో నిర్మించిన జంబోషెడ్, ఆధునీకరించిన టెండర్ హాల్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరితో కలిసి ఆయన ప్రారంభించారు. కాటాదారులకు రెండు జతల యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ జంబోషెడ్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తక్‌పట్టీల్లో పేర్కొన్నట్లు కాకుండా కొంతమంది కమీషన్ ఏజెంట్లు అధికంగా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, రైతులను దగా చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జంబోషెడ్‌లో 200 మంది రైతులు తమ పంటలను అమ్ముకోవచ్చన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు, డీఈ సుబ్బారెడ్డి, పాలకవర్గం వైస్ చైర్మన్ బీమేశ్వరరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

#### అన్ని వార్డులు అభివృద్ధి చేస్తాం

కల్లూరు: నగరంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కల్లూరు అర్బన్ పరిధిలోని 29వ వార్డులోని విజయనగర్ కాలనీ నుంచి వీవీఎస్ ఫంక్షన్ హాల్ వరకు రూ. 1.20 కోట్లతో మెయిన్ డ్రైనేజీ కాలువ పనులు, 31వ వార్డులోని రాఘవేంద్ర నగర్‌లో రూ. 40లక్షలతో, రఘునాథ్ కాంప్లెక్స్ లైన్‌లో రూ.30లక్షలతో డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పాలక సంస్థలో పాలక వర్గం ఏర్పడినప్పటి నుంచి కర్నూలు నగరం అభివృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఓటమి భయంతో గత ప్రభుత్వాలు నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో నగరపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడంతో పాలక వర్గం ఏర్పడి నగరంలోని సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు చెప్పే అబద్ధపు మాటలు నమ్మి మోసపోవదని సూచించారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను గమనించాలని, ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు మిద్దె చిట్టెమ్మ, సుదర్శన్‌రెడ్డి, శ్వేతారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, సాన శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

### టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

కల్లూరు: కల్లూరు అర్బన్ 31వ వార్డుకు చెందిన 20 టీడీపీ కుటుంబాలు సోమవారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. స్థానిక కార్పొరేటర్ మిద్దె చిట్టెమ్మ ఆధ్వర్యంలో ఆంజనేయులు గౌడ్, చెన్నయ్య, దావీదు, స్వప్న, లక్ష్మీదేవి, ఫాతిమా బేగంతో పాటు 20 కుటుంబాలకు చెందిన కార్యకర్తలకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వలన మేలు జరిగి ఉంటేనే మద్దతు ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా అడుగుతున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, నాయకులు తిరుపాల్, భాస్కర్ రెడ్డి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని

### అరోరా నగర్‌లో అగ్నిప్రమాదం

కర్నూలు: అరోరా నగర్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కాలనీ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న చెత్త అంటుకుని సోమవారం సాయంత్రం మంటలు వ్యాపించడంతో కాలనీకి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేసి ఉండవచ్చని, ఫలితంగా అగ్నిప్రమాదం చోటు చేసుకుందని సిబ్బంది అభిప్రాయపడ్డారు. విద్యుత్ అధికారులు సుమారు రెండు గంటల పాటు శ్రమించి కాలనీకి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

### వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): హాస్టల్ నుంచి అక్రమంగా సరుకులను రవాణా చేస్తున్న వార్డెన్ శిరీషను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిశేషు డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వార్డెన్ శిరీషపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డెన్ శిరీష హాస్టల్ సరుకులను ఇంటికి తీసుకెళ్లడం అన్యాయమన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు దామోదర్, రాజు, వినోద్, ఈశ్వర్, మాణిక్యం ఉన్నారు.